14 ఎకరాలు ఆక్రమణ

- 22.80 ఎకరాలకు మిగిలింది 8 ఎకరాలే..
- హైడ్రాకు అమీన్‌పూర్‌వాసుల ఫిర్యాదులు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమీక్షలో కుంట కబ్జా ప్రస్తావన

కబ్జాలతో.. శంభునికుంట కనుమరుగు



అమీన్‌పూర్‌లోని శంభునికుంట

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అమీన్‌పూర్ పట్టణంలో నడిబొడ్డున ఉన్న శంభుని కుంట కబ్జాకోరల్లో చిక్కుకుంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడే ఈ కుంట ఆక్రమణలకు గురైంది. విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలతో కుచించుకుపోయింది. హెచ్‌ఎండీఏ లేక్ జాబితాలో ఉన్న ఈ చెరువు విస్తీర్ణం మొత్తం 22.801 ఎకరాలు. అయితే రోజురోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలతో ఏకంగా ఈ కుంట విస్తీర్ణం ఏడు ఎకరాలకు పడిపోయింది. అంటే సుమారు 14 ఎకరాల వరకు ఈ కుంట కబ్జాల బారిన పడినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో ఇప్పుడు చెరువులు, కుంటల కబ్జాలపై హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఉక్కు పాదం మోపుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా ఈ శంభునికుంట ఆక్రమణలపై స్థానికులు పెద్ద ఎత్తున హైడ్రాకు ఫిర్యాదు చేశారు. నీటిపారుదలశాఖ రికార్డులు, మ్యాపులు, సరైన ఆధారాలతో ఈ కుంట కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ అమీన్‌పూర్ పట్టణంలో కబ్జాలకు గురైన చెరువులను స్వయంగా పరిశీలించారు. రెండు సార్లు ఆయన ఈ ప్రాంతాలను సందర్శించారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో ఈ శంభునికుంట అంశం ప్రధానంగా చర్చకొచ్చినట్లు నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఆక్రమణలన్నీ నేతలవే..

ఈ కుంట కబ్జాల వెనుక రాజకీయ నేతలే ఉండటం గమనార్హం. బడా నేతలు, వారి కుటుంబ సభ్యులు, బినామీ పేర్లతో కబ్జాలకు పాల్పడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా ఈ కుంటను కబ్జా చేశారు. కాగా ఈ కుంటను ఆక్రమించి కట్టిన కట్టడాలకు అమీన్‌పూర్ మున్సిపాలిటీ అధికారులు అనుమతులు మంజూరు చేయడం గమనార్హం. ఆక్రమణలకు పాల్పడింది ప్రజాప్రతినిధులు, నేతలే కావడంతో కొన్నింటికి అనుమతులు కూడా కట్టబెట్టారు. దీంతో ఈ కుంట ఆక్రమణలకు అడ్డు లేకుండా పోయింది.

వందల కోట్ల విలువ చేసే భూములవి..

అమీన్‌పూర్ పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలో వివిధ చోట్ల ఉద్యోగాలు చేసుకునే వారు, ఐటీ నిపుణులు ఎక్కువగా ఈ ప్రాంతంలో నివసిస్తుంటారు. దీంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక్కడ గజం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. దీంతో కబ్జాదారుల కన్ను అమీన్‌పూర్ శంభునికుంటపై పడింది. వందల కోట్లు విలువ చేసే ఈ కుంట స్థలాన్ని క్రమంగా ఆక్రమిస్తూ వచ్చారు. ఇక్కడ రెండు వందల గజాల నివాస స్థలం కొనుగోలు చేయాలంటే సుమారు రూ.కోటి వరకు వెచ్చించాల్సిన పరిస్థితి. ఈ లెక్కన కబ్జాకు గురైన సుమారు 14 ఎకరాల కుంట భూమి విలువ వందల కోట్లలో ఉంటుందని అంచనా.



హెచ్‌ఎండీఏ లేక్స్ వెబ్‌సైట్‌లో ఉన్న శంభునికుంట మ్యాప్

ఇళ్లలోకి వరద నీరు..

శంభునికుంట కబ్జాకు గురికావడంతో ఈ కుంటలో చేరాల్సిన వర్షం నీరు సమీపంలోని ఇళ్లలోకి వస్తోంది. జయలక్ష్మినగర్, సాయికాలనీ, మల్లికార్జున కాలనీ, వందనపురి కాలనీలపై వరద ప్రభావం పడుతోంది. వర్షం పడితే చాలు తమ కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని నాలాలన్నీ పొంగుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కబ్జా చేసింది నేతలే కావడం, వాటిని అడ్డుకోవాల్సి అధికారులు ఈ ఆక్రమణలకు వంత పాడటంతో స్థానికుల వేదన అరణ్యరోదనగా మారింది. ఇప్పుడు హైడ్రా కుంటలు, చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో ఈ ఆక్రమణలు తొలగిస్తారా? లేదా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మిన్నకుండి పోతారా అనేది వేచి చూడాల్సిందే.

2013లో నీటిపారుదలశాఖ, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు నిర్వహించిన సర్వే ప్రకారం శంభునికుంట వివరాలు ఇలా..

నీటి వనరు :	శంభునికుంట (దేవునికుంట)
కుంట ఎఫ్‌టీఎల్ :	22.801 ఎకరాలు
కుంట నీటిమట్టం :	541.91 మీటర్లు
కుంట కట్ట పొడవు :	250 మీటర్లు

ఏఐ.. డిజిటల్ అభ్యాసాన్ని మెరుగుపరుస్తుంది

రాయదుర్గం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ అభ్యాసాన్ని మెరుగుపరుస్తుందని హాంకాంగ్‌లోని ది ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జుసియోంగ్‌లీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో 'ఇన్ఫర్మేషన్ డిజిటల్ లెర్నింగ్ ఆఫ్ ఇంగ్లిష్ (ఐడీఎల్‌ఈ), జనరేటివ్ ఏఐ ఇన్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై నిర్వహించే అంతర్జాతీయ సమావేశంలో భాగంగా 'మనూ' ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ, ఓక్సస్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును 3 రోజులపాటు నిర్వహించనున్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఆంగ్లభాషా బోధన, పరిశోధనలో ఏఐ సాధనాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ ప్రొఫెసర్ పంచానన్ మొహంతి ప్రారంభించగా, రిసోర్స్‌పర్సన్లు డాక్టర్, ప్రమోద్ సాహ్, డాక్టర్ జుసియోంగ్‌లీ వ్యవహరించారు. ఈ సమావేశంలో మనూ ఓఎస్‌డీ-1 ప్రొఫెసర్ షుగుప్తాషాహీన్, మనూ ఆజాద్ చైర్ ప్రొఫెసర్ ఇంతియాజ్, రీసెర్చ్ స్కాలర్లు టీనా థామస్, ఎన్‌కే నజ్మా ప్రసంగించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



జలమండలి జీఎం బ్రిజేష్‌కు వినతిపత్రం ఇస్తున్న జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని మంగళవారం హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో జీఎం బ్రిజేష్‌ను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ జగదీశ్వర్‌గౌడ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి చందానగర్ వరకు మంజీరా రోడ్డులో చేపట్టిన పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రోడ్డు పనులు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో మంజీరా పైప్‌లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని జీఎం బ్రిజేష్‌ను కోరామన్నారు.

23 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 23 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 23 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: మనూలో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 'మనూ' ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో 'వాయిసెస్ ఆఫ్ ఇండియా అండ్ బియాండ్: మొబిలిటీ, సస్టైనబిలిటీ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై 3 రోజుల పాటు సదస్సు నిర్వహిస్తారు. బుధవారం ప్రారంభమయ్యే ఈ సదస్సును హెచ్‌సీయూ, ఓక్సస్ యూనివర్సిటీలలో కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే గాంధీ



ఎమ్మెల్యే గాంధీని కలిసిన డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, డాక్టర్లు విజయపూర్ణిమ, అన్నపూర్ణ

గచ్చిబౌలి: ఆరోగ్య శేరిలింగంపల్లిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని వైద్యాధికారులకు ఎమ్మెల్యే గాంధీ సూచించారు. శేరిలింగంపల్లి జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్‌లాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయపూర్ణిమ, శేరిలింగంపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఇతర డాక్టర్లు ఎమ్మెల్యే గాంధీని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కొండాపూర్ ఏరియా ఆస్పత్రి, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వైద్యసేవలను నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ఆస్పత్రులలో మౌలిక వసతుల కల్పనకు చొరవ తీసుకుంటామన్నారు. వర్షాకాలం డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధులు ప్రబల కుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన వైద్యసేవలను అందించాలని చెప్పారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ కాలనీలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్‌లు మంగళవారం పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా చిన్నారులను అభినందించారు.

కావూరిహిల్స్‌లో..

మాదాపూర్: కృష్ణాష్టమిని పురస్కరించుకుని కొండాపూర్ డివిజన్ పరిధి కావూరిహిల్స్ కాలనీలోని మల్లికార్జునాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చంద్రకాంత్‌రావు, కిట్టుయాదవ్, గంగారాం యాదవ్, ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.



వేడుకల్లో ఎంపీ రఘునందన్ రావు, రవికుమార్

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 25, పచ్చిమిర్చి 40, బెండ 40, కాకర 40, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 50, కీర 40, బీర 40, వంకాయ 40, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీ ఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

ఎమ్మెల్యే గాంధీని కలిసిన ఏఎంఓహెచ్



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డి మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ శ్రీకాంత్‌రెడ్డిని అభినందించారు. రాంకీ, జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయం లోపం తలెత్తకుండా చూడాలని సూచించారు. చెత్తకుప్పలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం..

పటాన్‌చెరు టౌన్: మట్టి గణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం అని విభూది బ్రదర్స్ కళాజాత బృందం సభ్యులు అన్నారు.తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ ఆదేశాల మేరకు 'విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటి' వారు మంగళవారం పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధమవుతున్న వేళ, మన పండుగలు, సాంప్రదాయాలను రక్షించుకుంటూ, శాస్త్రోక్తంగా గణపతి విగ్రహాన్ని చెరువు మట్టితో తయారు చేసి చెరువులోనే నిమజ్జనం చేయాలన్నారు. 10 రోజుల పాటు కాలేజీలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, జన సమ్మర్ధం ఉన్న ప్రాంతాలలో కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీబీ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్: మియపూర్ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమస్యల పరిష్కారం మరియు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మియాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలు మరియు చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ధికారులు ఈఈ రాజు, డీఈ ప్రవంతి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టాస్కులు, కమీషన్ పేరుతో సైబర్ మోసం..

రూ.2 లక్షల 5 వేలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్ పేరిట రూ.2 లక్షలు కాజేశారు సైబర్ మోసగాళ్లు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐటీడబ్ల్యూ సిగ్నోడ్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి ఏప్రిల్ 30న పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ వ్యక్తి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.2 లక్షల 5 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టాక్ మార్కెట్ పేరిట..

రూ.6 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. స్టాక్ మార్కెట్ పేరిట నగదు కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన ఓ వ్యక్తికి జూలై 7వ తేదీన స్టాక్ మార్కెట్ కు సంబంధించిన మెసేజ్ వాట్సప్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేశాడు. వారు ఓ ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు.అతను నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు.పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం 13 సార్లు రూ.6 లక్షల 19 వేలు ఇన్వెస్ట్ చేశాడు. దీంతో బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించ లేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ సభ్యత్వ నమోదును యజ్ఞంలా చేపట్టాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్



పార్టీ సీనియర్ నాయకుడిని సన్మానిస్తున్న రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదును యజ్ఞంలా చేపట్టాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ సూచించారు. కొండాపూర్ డివిజన్ మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కోర్ కమిటీ సభ్యుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ డివిజన్ల వారీగా ఇన్‌చార్జ్‌లు, కో ఆర్డినేటర్లను నియమించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన సూచించారు. నమోదు కార్యక్రమంలో తీసుకోవాల్సిన నియమ నిబంధనలను వివరించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రావు, సీనియర్ నాయకులు అశోక్, రాఘవేంద్ర రావు, నరేందర్‌రెడ్డి, మణిభూషణ్, మహిపాల్‌రెడ్డి, విజత్‌వర్మ, హన్మంతునాయక్, వరలక్ష్మి పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఖాజాగూడలో 'సేవ్ వాటర్.. సేవ్ లైఫ్' ర్యాలీ

రాయదుర్గం: మంచినీటి వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు 'సేవ్ వాటర్..సేవ్ లైఫ్' పేరిట వాటర్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో ఖాజాగూడలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. బస్తీవికాస్ మంచ్, వాటర్ ఎయిడ్ సంయుక్తంగా ఈ కార్యక్రమంను నిర్వహించారు. వీకర్ సెక్షన్ కాలనీలో ప్రజలకు నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ రజిత మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగించాలని, స్వచ్ఛమైన నీటిని తాగాలని సూచించారు. నీటి ప్రాధాన్యతను గుర్తెరగాలని సూచించారు. స్థానిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రమ, జ్యోతి, అరుణ, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, సంస్థ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.



ఖాజాగూడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఫీవర్ కేసులపై అప్రమత్తంగా ఉండాలి

- మందులు అందుబాటులో ఉంచాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

గచ్చిబౌలి: డెంగీ,, చికెన్‌గున్యా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ కొండాపూర్ జిల్లా ఆస్పత్రి వైద్యులకు సూచించారు. మంగళవారం కొండాపూర్ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను ఆరా తీశారు. వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా కేసులపై డాక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగులకు కావాల్సిన అన్ని పరీక్షలు ఆస్పత్రిలోనే చేయాలని, త్వరితగతిన రిపోర్ట్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణిరెడ్డిని ఆదేశించారు. జ్వర తీవ్రత ఉన్న వారికి వాడే మందులను అందుబాటులోకి ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రికి ఎక్కువగా వచ్చే వలస కూలీలకు సరైన వైద్యం అందించాలని కోరారు. రెండు గంటల పాటు ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఫీవర్ కేసుల కోసం పురుషులకు, మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డులను పరిశీలించారు.

ఖాజాగూడలో బీఆర్‌ఎస్ సంబరాలు

రాయదుర్గం: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై ఖాజాగూడలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం సాయంత్రం టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీఆర్‌ఎస్ నాయకులు చెన్నంరాజు, నరేష్, అంజమ్మ, జగదీష్, యాదగిరి పాల్గొన్నారు.

వినతి

పటాన్‌చెరు టౌన్: బండ్లగూడ వార్డ్-4 లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన బాత్‌రూంలను తొలగించాలంటూ మంగళవారం డిప్యూటీ కమిషనర్ సురేష్‌ని కలిసి బండ్లగూడవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డ్-4 లో రహదారిని ఆక్రమించి బాత్‌రూమ్స్ నిర్మించారని వాటిని తొలగించాలని డీసీకి వినతి పత్రం అందజేశామని తెలిపారు.



ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని యూపీహెచ్‌సీలో వారం రోజులపాటు ఆశా వర్కర్ల శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. గర్భం దాల్చగానే 8 వారాలలోపు నమోదు చేసి వారికి తరచూ పరీక్షలు చేయించి ప్రసవం అయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ఇవ్వాలన్నారు. సుఖ ప్రసవం కోసం ముందు జాగ్రత్తలు, డెలివరీకి ఆస్పత్రికి తీసుకుపోవడంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న వారికి రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ పూర్ణిమ, శేరిలింగంపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సీహెచ్ స్వామి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన ప్రకారం.. కొండాపూర్ శ్రీరాంనగర్‌లోని ఎల్‌ఎన్ వైన్ షాపు ఎదురుగా ఓ వ్యక్తి(35) చనిపోయి ఉన్నాడని స్థానికులు డయల్ 100కు కాల్ చేశారు. మృతుడు అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. సంబంధీకులు ఉంటే 9490617127 ఫోన్ నంబర్ లేదా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462